క్లుప్తంగా

పశువులకు టీకాలు



పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సి.బెళగల్: మండల కేంద్రంలోని పశువులకు పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ శుక్రవారం టీకాలు వేశారు. జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా వాటికి టీకాలు వేయించాలని రైతులకు సూచించారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా విజయభాస్కర్



బాధ్యతలు స్వీకరించిన ఎం.విజయభాస్కర్

కర్నూలు (న్యూటౌన్): ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.విజయభాస్కర్ కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ చాలా కాలంగా రెగ్యులర్ ఎంఈఓ లేరు. ప్రస్తుతం గోనెగండ్ల ఎంఈఓ వినోద్‌కుమార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు చూసేవారు. ఆయన స్థానంలో విద్యాశాఖ అధికారులు ఎం.విజయభాస్కర్‌ను నియమించారు. పలువురు హెచ్‌ఎంలు అభినందనలు తెలిపారు.

మిరప రక్షణ చర్యలు తీసుకోవాలి



మిరప రైతులకు సూచనలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మిరప పంటలో సంరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చింతమానుపల్లె, సి.బెళగల్‌లో పర్యటించి పంటలను పరిశీలించారు. మిరప పంటలో దోమల ఉధృతిని గుర్తించి వాటి నివారణకు రైతులకు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలను తనిఖీ చేసి రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులతో సమావేశమై రైతుల అవసరాలు, వ్యవసాయ రంగంలో చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు.

ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయాలి



ఓటరు స్లిప్‌లను సిద్ధం చేయిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో ఎమ్మెల్సీ ఓటరు స్లిప్‌లను పకడ్బందీగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మండలానికి చేరిన ఓటరు స్లిప్‌లను డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) సరళ, మండల రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆయన బీఎల్ఓలతో మాట్లాడుతూ ఈనెల 13న నిర్వహించే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటరు స్లిప్‌లు సోమవారం సాయంత్రంలోగా ఓటర్లకు పంపిణీ చేయాలన్నారు.

'శాంతిరాం'లో సెమినార్



సెమినార్‌ను ప్రారంభిస్తున్న శాంతిరాముడు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సెమినార్(జాతీయ టెక్నికల్ సింపోజియ్-సిగ్మా2కె-23)ను చైర్మన్ శాంతిరాముడు ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెమినార్లలో పాల్గొని ప్రతిభను చాటుకోవాలన్నారు. కొత్త కొత్త ఆవిష్కరణలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, కో-కన్వీనర్ శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

కర్నూలు (టౌన్): ఈనెల 8, 9 తేదీలలో నగరంలో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు నగర పాలక కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగాలపాడు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్‌నగర్‌కు వెళ్లే ఫిల్టర్ బెడ్స్‌కు నీటి సరఫరా చేసే 1200 ఎం.ఎం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని ఆయన తెలిపారు.

ఉత్సవాలకు వేళాయె!

- మతసామరస్యానికి ప్రతీక ఒండుట్ల తిరుణాల
- 6 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తుల కోర్కెలు తీర్చుతున్న లక్ష్మీరంగస్వామి, రంగల్ దర్వేశిఖాద్రీ



భక్తులకు దర్శనమిస్తున్న దర్వేశి ఖాద్రీ(ఫైల్)

మతసామరస్యానికి మారు పేరు ఒండుట్ల తిరుణాల. గ్రామ సమీప కొండపై హిందూ దేవుడు లక్ష్మీరంగస్వామి.. కొండ కింద ముస్లిం దేవుడు రంగల్ దర్వేశి ఖాద్రీ కొలువైన గ్రామం ఒండుట్ల. రెండు మతాల దేవుళ్ల ఉత్సవాలు ఏటా ఒకే సారి అంగరంగ వైభవంగా జరగడం ఇక్కడి విశేషం. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు భక్తుల నుంచి పూజలందుకోవడానికి లక్ష్మీరంగస్వామి, రంగల్ దర్వేశి ఖాద్రీ సిద్ధం కాగా గని, ఒండుట్ల, ఎల్‌కే తండా, మంచాలకట్ట తదితర గ్రామాల ప్రజలు సంబరాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కొలిచేవారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న రంగస్వామి





తిరుణాలకు ముస్తాబవుతున్న రంగల్ దర్వేశి ఖాద్రీ

గడివేముల: మండలంలో పరిధిలోని ఒండుట్ల గ్రామ సమీపంలో ఉన్న కొండల్లో వెలసిన లక్ష్మీరంగస్వామి, రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామివార్లు పూజలుందుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొండపైన ఒకే రాతి గుహలో స్వయంభూ లక్ష్మీరంగనాయకస్వామి కొలువుదీరారు. కొండ కింద రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామివారు ఉన్నారు. వీరి తిరుణాల ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. కుల మతాలకు అతీతంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి రానుండటంతో అందుకు కావాల్సిన ఏర్పాట్లను నిర్వాహకులు ఇప్పటికే పూర్తి చేశారు.

6 నుంచి ఉత్సవాలు..

ఈ నెల 6 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మొదటి రోజు 6వ తేదీ సోమవారం గని గ్రామం నుంచి లక్ష్మీరంగనాయక స్వామివారిని పల్లకీలో మంగళవాయిద్యాలతో కొండపైకి చేర్చి రాత్రి గరుడ సేవ నిర్వహిస్తారు. కొండ కొండ రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామికి గని గ్రామం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొర్చి దర్గాకు చేర్చుతారు. రెండో రోజు మంగళవారం ఉదయం లక్ష్మీసమేత రంగనాయక స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. మరో వైపు దర్గా వద్ద కిస్తీ వేడుకలు ఘనంగా జరుగుతాయి. చివరి రోజు గ్రామోత్సంతో ఉత్సవాలు ముగుస్తాయి. తిరుణా సందర్భంగా మూడు రోజుల పాటు భక్తుల కోసం గని గ్రామంలో ఆర్కెస్ట్రా, దేవ నర్తకి పూర్తి నాటకం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం నంద్యాల, నందికొట్కూరు డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను నడుపుతారు.

రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు

రంగస్వామి, దర్వేశిఖాద్రీ తిరుణాల సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు నిర్వహిస్తున్నారు. 8న ఆరు పండ్లలోపు ఎడ్లకు బండలాగు పోటీలు జరగనున్నాయి. అలాగే 7న పొట్టేళ్ల పందేలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



ఒకే బండరాయి కింద కొలువైన రంగస్వామి

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



రంగస్వామి, రంగల్‌దర్వేశిఖాద్రీ తిరుణాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలి.
– నల్లల ప్రభాకర్‌రెడ్డి, చైర్మన్, ఒండుట్ల రంగస్వామి ఆలయం

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్‌లో లబ్ధిదారుడికు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజ్‌కుమార్

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల వలంటీర్ రాజ్‌కుమార్ గురువారం హైదరాబాద్‌కు వెళ్లి ఓ లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. గ్రామానికి చెందిన బారికి నారాయణ పక్షవాతంతో బాధ పడుతున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న కుమారుడు రాజేష్ వద్ద ఉంటూ అక్కడే వైద్యం చేయించుకుంటున్నాడు. వృద్ధుడి రాలేని పరిస్థితిని తెలుసుకున్న వలంటీర్ హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ సొమ్ము రూ.3,000 అందజేయడంతో లబ్ధిదారుడు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి..

పాణ్యం: మండలంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. శుక్రవారం కొలూరు గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు ఆర్ మద్దిలేటి పక్షవాతంతో శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా వలంటరీ లక్ష్మన్న అక్కడికి వెళ్లి పింఛన్ అందించారు.

7 నుంచి కాల్వలో ఉరుసు

ఓర్వకల్లు: కాల్వ గ్రామంలో ఈ నెల 7 నుంచి హజరత్ సయ్యద్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసు జరగనున్నట్లు దర్గా పీఠాధిపతులు సయ్యద్ సహాబుద్దీన్‌షా ఖాద్రి, సయ్యద్ ఖమర్‌షా ఖాద్రి శుక్రవారం తెలిపారు. 7 గంధం సమర్పణ, 8న ఉరుసు, 9వ జియారత్, కిస్తీతో వేడుకలు ముగుస్తాయన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ల తనిఖీ



కె.నాగలాపురంలో పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం, పెంచికలపాడులోని ఫిల్లింగ్ స్టేషన్ల(పెట్రోల్ బంక్‌లు)ను శుక్రవారం తహసీల్దార్ శివరాముడు తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్‌ను పరిశీలించారు. వాహనదారులకు తాగునీరు, టాయిలెట్లు, ఎయిర్ తదితర వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పెట్రోల్, డీజిల్‌లలో అక్రమాలు, కల్తీకి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ నవీన్, వీఆర్వో కృష్ణారెడ్డి, వీఆర్ఏ శివ ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు కల్పించాలి

- కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్



మామిదాలపాడులో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 13న జరగనున్న రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్లలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్టాంటన్‌పురం, మామిదాలపాడులోని పోలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేసి, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చే గ్రాడ్యుయేట్స్‌కు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని సూచించారు. ఆర్డీఓ వెంట కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు, మండల సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

కూలీ రేట్లపై అధికారులు స్పందించాలి



తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రమిస్తున్న దృశ్యం

కల్లూరు: ఉలిందకొండ గ్రామ పరిసరాల్లోని కంకర మిషన్లలో పని చేస్తున్న కార్మికుల కూలీ రేట్లపై అధికారులు స్పందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కార్మికులు తహసీల్దార్ టీవీ రమేష్‌బాబుకు వినతి పత్రమిచ్చారు. వీరికి మద్దతుగా జి.రామకృష్ణ మాట్లాడుతూ 300 కుటుంబాలు కంకర కొట్టే పనిమీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. రెండేళ్లకోసారి కూలీ రేట్లను పెంచే సంప్రదాయం ఉందన్నారు. గడువు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా కూలీల రేట్లు పెంచడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. అలాగే బోర్ బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు నెర్రెలు ఇచ్చి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని వెంటనే ఆపాలన్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న ఎస్‌ఐ సోమ్లానాయక్

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పర్ల బాలుర వసతి గృహం పదో తరగతి విద్యార్థి బైరపోగు జాషువా ఆచూకీ శుక్రవారం లభ్యమైంది. ఎస్‌ఐ సోమ్లానాయక్ విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. గత నెల 24న హాస్టల్ నుంచి విద్యార్థి జాషువా వెళ్లిపోయాడు. దీంతో వార్డెన్ శ్యామసుందరరావు మునగాలలోని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బంధువులు, తెలిసిన వారిని విచారించినా విద్యార్థి ఆచూకీ లేకపోవడతో గత నెల 26న కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టగా బంధువుల ఇంట్లో ఉన్నాడని తెలుసుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకునివచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రీసర్వేను వేగవంతం చేయాలి



హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రీసర్వేలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ చేయించి మార్కింగ్, చెక్ పాయింట్స్ వేసుకొని పూర్తి చేసుకోవాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మార్చి ఆఖరునాటికి రూఫ్, రూఫ్ కాంక్రీట్ లెవెల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఉగాదిలోపు పూర్తి చేయించాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డేలో భాగంగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులు జగనన్న కాలనీలను సందర్శించాలన్నారు. గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను విరివిగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, బిల్లులను ఎప్పటికప్పుడు జనరేట్ చేయాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణాలకు భూసేకరణ పనులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈక్రాప్ బుకింగ్ పూర్తి అయిందని, ఆ వివరాలను రెవెన్యూ రికార్డ్స్‌తో పరిశీలన చేయించాలని తహసీల్దార్లను ఆదేశించారు. హార్టికల్చర్ పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లాల్లో ఉన్న అమృత్ సరోవర్ ట్యాంకుల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్ పై దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ అప్పలకొండ, ఏపీసీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



మునగాల సచివాలయం ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. మండల పరిధిలోని బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు, జూలకల్, మునగాల గ్రామాల్లోని పాఠశాలలు, సచివాలయాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటనిలబెట్టుకున్నారన్నారు. ఈ నెల 13న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూజ రవీంద్రారెడ్డి, ఎంఈ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

పట్టణంలో..

గూడూరు: ఈ నెల 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శుక్రవారం వారు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను అప్పగించండి

కల్లూరు: మూడేళ్లగా మూత పడిన ప్రైవేటు-అన్‌ఎయిడెడ్ పాఠశాలల రికార్డులు ఈ నెల 6వ తేదీలోగా అందజేయలని ఎంఈఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్లూరులోని మదర్ థెరిస్సా విద్యానికేతన్, శాంతి విద్యామందిర్, పద్మశ్రీ విద్యానికేతన్, వీకేఎంఎస్ లీడర్స్ ప్రైమరీ, వెంకటేశ్వర నగర్‌లోని ఈశ్వర్ ఇంగ్లీష్ మీడియం, గోవర్ధన్‌నగర్‌లోని శ్రీ గాయత్రి, ఉలిందకొండలోని ఎస్‌వీ యూపీ, పెద్దటేకూరులోని మణిసాయి కాన్సెప్ట్ యూపీ పాఠశాలలు రికార్డులను అందించాలన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై కేసు నమోదు

గడివేముల: నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్‌పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. గత ఏడాది జూన్ 19న చిందుకూరు గ్రామానికి చెందిన కుంచేపు పార్వతమ్మకు, కండక్టర్ వెంకటేశ్వర్లుకు బస్సు నిలిపే విషయంలో వాగ్వాదం జరిగింది. కండక్టర్ తనను కాళ్లతో తన్ని, చేతులతో కొట్టి, నానాభూతులు తిట్టాడని బాధితురాలు కుంచేపు పార్వతమ్మ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు కండక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

క్రమశిక్షణ అవసరం

సి.బెళగల్: విద్యార్థులకు చదవుతోపాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎస్‌ఐ పీరయ్య సూచించారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలల చట్టాలు, విద్యార్థుల బాధ్యతలు, వ్యవహార తీరు, శిక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ బాలల చట్టాలపై మాట్లాడారు. పోక్సో, దిశ, మైనర్ వాహన వినియోగ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ బలరాముడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పేది శ్రద్ధగా విని పరీక్షల్లో అధిక మార్కులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

8న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో ఈ నెల 8న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హజరత్ సయ్యద్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించే పోటీలలో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440984959ను సంప్రదించాలన్నారు.

నూర్పిడి యంత్రాలతో ఆర్థిక వెసులుబాటు

- ఏపీజీబీ ఆర్ఎం పీవీ రమణ



నూర్పిడి యంత్రాలను పరిశీలిస్తున్న బ్యాంక్ అధికారులు

ఓర్వకల్లు: నూర్పిడి యంత్రాలతో ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ అధికారి పీవీ రమణ అన్నారు. మండలంలోని నన్నూరు గ్రామంలో బృందావనం గ్రామైక్య సంఘంలో అశ్విని మహిళా సంఘం సభ్యురాలు ఈశ్వరమ్మకు మంజూరైన నాలుగు రకాల చిరుధాన్యాల నూర్పిడి యంత్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆహార ఉత్పత్తి పథకం ద్వారా చిరుధాన్యాల నూర్పిడి యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీ కింద మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఒక్కో యూనిట్ ధర రూ.1,62,500 చొప్పున నాలుగు యంత్రాలను మంజూరు చేసిందన్నారు. 35 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుకుమార్, ఎస్ఎం చంద్రశేఖర్ ఆజాద్, ఫీల్డ్‌ఆఫీసర్ పరమేష్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వెంకటరామిరెడ్డి, సీసీలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పులకుర్తిలో వేరుశనగ సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పైర్లలో తెగుళ్లు సోకితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతులకు సూచించారు. శుక్రవారం పులకుర్తి, కల్లపరి గ్రామాల పరిధిలోని పొలాలను ఆయన పరిశీలించారు. రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ వేసవిలో ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి సాగు చేయరాదన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: వలసలను నివారించేందుకు ప్రభుత్వం ఉపాధి పనులను కల్పిస్తోందని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేసి ఉపాధి సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.250ల వరకు వేతనం పడుతుందన్నారు.

నగరపాలక బడ్జెట్ రూ.255.99 కోట్లు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థ 2023-24 వార్షిక బడ్జెట్ శుక్రవారం ఆమోదం పొందింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగరపాలక కమిషనర్ భార్గవతేజ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ సమావేశానికి ఆమోదం పొందారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ సమావేశ హాలులో నగర మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య బడ్జెట్ సమావేశంలో పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ నగరంలో పనులు ఎందుకు జాప్యం జరుగుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. ఒక ఏరియాలో ఒక విధంగా పనులు జరుగుతుంటే ఏమి చేస్తున్నారన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు ఎందుకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో వచ్చే సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లందరూ మేయర్ పోడియం వద్ద కూర్చొని ఆందోళన, నిరసనలు చేపడతారని హెచ్చరించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలాలు కబ్జాకు గురవుతుంటే ఏమి చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నించారు. జోహరాపురం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్న విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఏమి చేశారని ప్రశ్నించారు. మేయర్ స్పందిస్తూ.. సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి, మున్సిపల్ ఎస్ఈ శేషసాయి, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.